కేసీఆర్ చెప్పితే వినకపోతిరి

- 10 ఎంపీ సీట్లు గెలిపిస్తే బీఆర్ఎస్ చక్రం తిప్పుతుండె
- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ట్వీట్

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): ప్రస్తుతం జాతీయస్థాయిలో జరుగుతున్న రాజకీయ పరిణామాల్లో తెలంగాణ పాత్ర లేకుండా చేశారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ 'బీఆర్ఎస్ పార్టీని 10 స్థానాల్లో గెలిపిస్తే కేంద్రంలో చక్రం తిప్పుతానని ఎన్నికల ప్రచారం సందర్భంగా అధ్యక్షుడు కేసీఆర్ ఎన్నోసార్లు చెప్పారు. కానీ కొందరు వెటకారం చేశారు. బీఆర్ఎస్‌ని ఓడించి తెలంగాణ వారికి వాయిస్ లేకుండా చేసుకున్నారు. ఇప్పుడు చూడండి.. 16 సీట్లు ఉన్న చంద్రబాబు, 12 సీట్లు ఉన్న నితీశ్‌కుమార్ కేంద్రంలో చక్రం తిప్పే స్థాయిలో ఉన్నారు. అదే ఈ రోజు బీఆర్ఎస్‌కు 10 సీట్లు ఉంటే మన రాష్ట్రానికి కావాల్సినవి కొట్లాడి తెచ్చుకునే వాళ్లం' అని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు కేవలం గుంపులో గోవింద లెక్క అయ్యారని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

'సమ్మక్కసాగర్' నీటి వినియోగం లెక్కలివ్వండి

తెలంగాణకు ఎన్‌డబ్ల్యూడీఏ లేఖ

హైదరాబాద్, జూన్6 (నమస్తే తెలంగాణ): ములుగు జిల్లాలోని సమ్మక్కసాగర్ బరాజ్, దానికి ఎగువన, దిగువన ఉన్న నీటివినియోగ లెక్కలను అందజేయాలని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎన్‌డబ్ల్యూడీఏ) తెలంగాణ సర్కారుకు సూచించింది. ఈ మేరకు ఓ లేఖ రాసింది. గోదావరి, కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టును ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలని ఇటీవల ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. అయితే దానిపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేంద్రానికి లేఖ రాసింది. ఇచ్చంపల్లి వద్ద బరాజ్‌ను నిర్మిస్తే దానికి దిగువ ఉన్న సమ్మక్కసాగర్ బరాజ్‌పై తీవ్ర ప్రభావం పడుతుందని, లోయర్ గోదావరిలో తెలంగాణ తన నీటివాటాను వినియోగించడంలో సమస్యలు తలెత్తుతాయని ఎన్‌డబ్ల్యూడీఏకు తెలంగాణ వెల్లడించింది. తాజాగా ఈ లేఖపైనే ఎన్‌డబ్ల్యూడీఏ స్పందించింది.

నేడు మేడిగడ్డకు మంత్రి ఉత్తమ్

బరాజ్‌ల మరమ్మతుల పరిశీలన

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి శుక్రవారం సందర్శించనున్నారు. తొలుత సుందిల్ల, అన్నారం బరాజ్‌లను పరిశీలించి అనంతరం మేడిగడ్డ బరాజ్‌ను విజిట్ చేయనున్నారు. ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ మధ్యంతర సిఫారసుల మేరకు 3 బరాజ్‌ల రక్షణకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. నిర్మాణ ఏజెన్సీలు పునరుద్ధరణ పనులు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పనులను ఈఎన్సీ అనిల్‌కుమార్, నాగేందర్‌రావు ఇతర అధికారులతో కలిసి మంత్రి పరిశీలించనున్నారు.

బీజేపీకి రేవంత్ అవయవదానం

- అందుకే సీఎం సొంత సీటులో ఆ పార్టీ గెలుపు
- మంత్రుల స్థానాల్లోనూ కమలం పార్టీకి అధిక ఓట్లు
- ఎనిమిది సీట్లు రెఫరెండానికి సానుకూలమా?
- బీజేపీ గెలుపునకు పరోక్షంగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ
- పడిలేచే కెరటం బీఆర్ఎస్: ఎర్రోళ్ల, దేవీప్రసాద్

గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్. చిత్రంలో పార్టీ నేత దేవీప్రసాద్

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత లోక్‌సభ నియోజకవర్గం మహబూబ్‌నగర్‌లో బీజేపీని గెలిపించడానికి అవయవదానం చేశారని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. రాష్ట్ర మంత్రులు, విప్‌ల నియోజకవర్గాల్లో గత అసెంబ్లీ ఎన్నికల కంటే గణనీయంగా ఓట్లు తగ్గి, బీజేపీకి ఎక్కువ ఓట్లు వచ్చాయని తెలిపారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్టు సీఎం వ్యవహరిస్తున్నారని, బీఆర్ఎస్‌పై పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని మండిపడ్డారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. వాస్తవానికి బీజేపీకి ఓట్లు బదిలీ చేసింది రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రభుత్వ విప్‌లేనని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను బరిలో నిలిపిందని విమర్శించారు. చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి లాంటి సీట్లలో డమ్మీ అభ్యర్థులను నిలబెట్టారని వెల్లడించారు. అక్కడ బీజేపీ అభ్యర్థుల విజయానికి కాంగ్రెస్ పరోక్షంగా పనిచేసిందని తెలిపారు. రేవంత్‌రెడ్డి సిట్టింగ్ ఎంపీ సీటు మల్కాజిగిరినీ కాంగ్రెస్ నిలబెట్టుకోలేకపోయిందని అన్నారు. బీజేపీకి బీఆర్ఎస్ అవయవదానం చేసిందని, సిద్దిపేటలో బీజేపీకి హరీశ్‌రావు ఓట్లు బదిలీ చేశారన్న సీఎం నిరాధార ఆరోపణలను ఎర్రోళ్ల తిప్పికొట్టారు. రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో బీజేపీకే ఆధిక్యం వచ్చిందని, ఆయన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో బీజేపీ గెలిచిందని, అంటే.. రేవంతే బీజేపీకి ఓట్లు బదిలీ చేశారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో 1.07 లక్షల ఓట్లతో 34 వేల మెజారిటీ వస్తే, ఈ సారి 23 వేలకు ఎందుకు తగ్గిందని నిలదీశారు. రేవంత్‌రెడ్డి, మంత్రులే బీజేపీకి అవయవ దానం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెఫరెండంలో రేవంత్ ఫెయిల్

పార్లమెంటు ఎన్నికలు రెఫరెండం అన్న సీఎం రేవంత్ తన లక్ష్యంలో ఫెయిల్ అయ్యారని, రాష్ట్రంలో 17 సీట్లు ఉంటే 8 మాత్రమే గెలిచారని ఎర్రోళ్ల విమర్శించారు. ఆరు నెలల పాలనలో కాంగ్రెస్ విఫలమైనందుకే 8 సీట్లకు పరిమితమైందని తెలిపారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, విప్‌లు లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్ నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల కంటే కాంగ్రెస్‌కు ఓట్లు తగ్గి బీజేపీ గెలిచిందని గుర్తుచేశారు. పడిలేచిన కెరటంలా బీఆర్ఎస్ దూసుకొస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌పై పిచ్చి ప్రేలాపనలు బంద్ చేయాలని సీఎంకు సూచించారు.

రేవంత్‌ది అధికార మదం: దేవీప్రసాద్

బీఆర్ఎస్ బూడిద అయ్యిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి అధికార మదంతో మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న 2014లో 11 ఎంపీ సీట్లు, 2019లో 9 ఎంపీ సీట్లు గెలుచుకున్నదని.. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ 8 సీట్లే సాధించిందని వెల్లడించారు. కాంగ్రెస్ పాలనకు ప్రజలు మార్కులు వేయలేదని, అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు తెచ్చుకున్న ఆ పార్టీ.. ఇప్పుడెందుకు తక్కువ తెచ్చుకున్నదో చెప్పాలని సీఎంను డిమాండ్ చేశారు. అమరవీరుల జాబితా కూడా సరిగా తయారుచేయలేని అసమర్థుడు రేవంత్‌రెడ్డి అని మండిపడ్డారు. గతంలో అనేక రాష్ట్రాల్లో అనేక పార్టీలు ఖాతా తెరవలేదని, తర్వాతి ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాయని, తెలంగాణలోనూ అదే జరగబోతున్నదని తెలిపారు. వెయ్యి మంది రేవంత్‌లు, వంద మంది మోదీలు వచ్చినా బీఆర్ఎస్‌ను ఏమీ చేయలేరని తేల్చిచెప్పారు.

గురువారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

భవిష్యత్తు కార్యాచరణపై బీఆర్ఎస్ సమాలోచన

మొదటిపేజీ తరువాయి...

అంటూ గులాబీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

వెన్నుపోటుదారులెవరు?

ఎన్నికల సందర్భంగా పార్టీ నుంచి వెళ్లిపోయిన వారెలాగూ వెళ్లిపోయారు.. కానీ పార్టీలోనే ఉంటూ వెన్నుపోటు పొడిచినవారెవరు? అన్న విషయాలను తీవ్రంగా పరిగణించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవాలని తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు సూచించినట్టు విశ్వసనీయ సమాచారం. పార్టీలోనే ఉంటూ నష్టంచేసే వారిని మొదటి నుంచి ఉపేక్షిస్తుండటం వల్లనే ఈ స్థాయిలో నష్టం జరిగిందని, ఇకపై వారిపట్ల ఉదారంగా వ్యవహరించకుండా కఠినంగా వ్యవహరించాలని కేసీఆర్‌కు చెప్పినట్టు తెలిసింది. పార్టీలో, ప్రభుత్వంలో అన్నిరకాల అవకాశాలు, గౌరవాలు పొందినవారే పార్టీకి తీరని అన్యాయం చేశారని అటువంటి వారి పట్ల నిర్దయంగా ఉండాలని సూచించినట్టు సమాచారం.

పకడ్బందీ వ్యూహం

మరోవైపు భవిష్యత్తు కార్యాచరణపై పార్టీ ముఖ్యనేతలతో కేసీఆర్ లోతైన సమాలోచనలు జరుపుతున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాకపోవటం వల్ల రాజకీయాలకు దూరమైనట్టు కాదని, ప్రజల పక్షాన పోరాడటంలో వెనుకంజ వేసే ప్రసక్తే లేదని గులాబీశ్రేణుల్లో ఆత్మస్థయిర్యం నింపే ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టానికి విరుద్ధంగా బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ చేర్చుకోవటాన్ని తీవ్రంగా పరిగణించి ఇప్పటికే పలు వేదికల మీద పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిపై అనర్హతవేటు విషయంలో బీఆర్ఎస్ పార్టీ రాజీలేని పోరాటం చేయటంలో అలసత్వం చేయకూడదని ఈ దిశగా కార్యాచరణను రూపొందించాలని పలువురు పార్టీ ముఖ్యనేతలు కేసీఆర్‌కు సూచించినట్టు తెలుస్తున్నది. మొత్తంగా పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా మాజీ మంత్రులు, ముఖ్యనేతలు భవిష్యత్తు కార్యాచరణపై మంతనాలు నెరుపుతున్నట్టు సమాచారం

కింకర్తవ్యం?

పార్లమెంట్ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో రాజకీయంగా అనుసరించాల్సిన వైఖరిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ ముఖ్యనేతలతో సమాలోచనలు జరుపుతున్నారు. మాజీ మంత్రులు, ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో కేసీఆర్ దశలవారీగా మంతనాలు జరుపుతున్నట్టు సమాచారం. తమదే గెలుపు అని ఆశించిన అభ్యర్థులకు, ఆయా నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పనిచేసిన ముఖ్యనాయకులకు కేసీఆర్ ఫోన్లు చేసి మాట్లాడుతున్నట్టు తెలిసింది. గెలిచిన నాడు పొంగిపోవడం, ఓడిపోతే కుంగిపోవడం రాజకీయ నాయకుల లక్షణం కాకూడదని, ప్రజలు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా మసలుకొని ముందుకు సాగాలని హితబోధ చేసినట్టు సమాచారం. అలాగే పార్టీ ఆవిర్భావం నుంచి ఇటువంటి గెలుపోటములు అనేకం చవిచూశామని, ఉత్థానపతనాలను బేరీజు వేసుకొని ముందుకు సాగడటమే తప్ప కుంగిపోకూడదని సూచించినట్టు తెలిసింది.

బదిలీల బుగులు

మొదటిపేజీ తరువాయి...

ఎమ్మెల్సీ ఎన్నికలు, ఆపై పార్లమెంటు ఎన్నికలతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో గత రెండు, మూడు నెలలుగా పాలన నామమాత్రంగానే సాగింది. ఏ ప్రభుత్వ కార్యాలయంలోనూ ప్రజలకు ఆశించిన స్థాయిలో పౌర సేవలు అందలేదు. వేసవి కార్యాచరణ తూతూమంత్రంగా రూపొందించి అమలు చేయటం, నీటిపారుదల రంగంలోనూ ప్రణాళిక లేకపోవడంతో ప్రజలు, రైతులు పెద్దఎత్తున తాగు, సాగునీటి సమస్యల్ని ఎదుర్కొన్నారు.

వర్షకాలం ముందు రూపుదిద్దుకోని ప్రణాళిక

అధికార యంత్రాంగం ఏటా వేసవిలోనే వర్షాకాలానికి ముందు చేపట్టాల్సిన చర్యలపై దృష్టిసారిస్తుంది. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, కాల్వల మరమ్మతులు, చెరువుల ఫీడర్ చానెళ్ల మరమ్మతులు, విద్యుత్తు వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నాలాల పూడికతీత వంటి పనులను పూర్తిచేయాల్సి ఉంటుంది. కానీ ఈ వేసవిలో అధికార యంత్రాంగం ఇలాంటి చర్యలేమీ చేపట్టలేదు. ప్రభుత్వం కూడా పురమాయించిన దాఖాలాలు లేవు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నదన్న సాకు చూపెట్టినా, 2019లో ఇదే సమయంలో ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. కరోనా సమయంలో హైదరాబాద్‌లో పెద్దఎత్తున రోడ్ల నిర్మాణం చేపట్టడంపై అన్నిరంగాల నుంచి ప్రశంసలు వచ్చాయి. కానీ ఈ సారి వేసవిలో పూర్తి కావాల్సిన మౌలిక వసతుల కల్పన కూడా మొదలు కాలేదు. పైగా గత ప్రభుత్వ హయాంలో మంజూరైన, టెండర్లు పూర్తయిన, ఆదిలో ఉన్న కోట్ల రూపాయల పనులను రద్దుచేశారు. ఒక్క గ్రేటర్ పరిధిలోనే రూ.222 కోట్ల పనులను రద్దు చేయగా, రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇంకెన్నో పనులు ఉన్నాయి. గ్రామపంచాయతీల్లో కనీస నిర్వహణ నిధులు కూడా లేని దుస్థితి. ఫలితంగా గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో పాలన పడకేసిందనే ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.

మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టు అధికారుల ప్రదక్షిణలు

రేవంత్ సర్కారు ఏర్పడిన కొత్తలోనే రాష్ట్రంలో అధికారులకు స్థానచలనం కల్పించారు. దాంతో పార్లమెంట్ ఎన్నికల్లో ఈసీ వారినే కొనసాగించింది. అయితే, ఇప్పుడు రాష్ట్రంలో మరోసారి పెద్ద ఎత్తున బదిలీలు ఉంటాయన్న ప్రచారం సాగుతున్నది. గురువారంతో ఎన్నికల కోడ్ ముగిసినందున ఈ నెల 12, 13 తేదీల్లో భారీఎత్తున బదిలీలకు రంగం సిద్ధమైనట్టు ప్రచారం జరుగుతున్నది. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఆర్నెల్లలోనే రెండు పర్యాయాలు అధికార యంత్రాంగంలో మార్పులు జరగటం దేనికి సంకేతం? అన్న ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. ఏ కార్యాలయంలో ఏ అధికారిని కదిలించినా తానెక్కడ ఉంటానో తెల్వదు అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సచివాలయం మొదలు మండలస్థాయి వరకు యంత్రాంగంలో భారీస్థాయిలోనే స్థానచలనం కల్పించేందుకు రంగం సిద్ధమైనట్టు వార్తలు వస్తున్నాయి. దీంతో అధికారులెవరూ దస్త్రాలను ముట్టుకోవటం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఫలానా అధికారిని మార్చండి అంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. ఉదాహరణకు ట్రై పోలీసు కమిషనరేట్ల పరిధిలోనే ఈస్థాయి ఒత్తిళ్లు మంత్రుల నుంచి ఉన్నట్టు సమాచారం. అనేక జిల్లాల్లో కలెక్టర్ల మార్పునకు కూడా మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి సర్కారుపై ఒత్తిళ్లు వస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. దాంతో అధికారులు పౌర సేవలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోపక్క నైరుతి ముందుగానే పలకరించటంతో రైతులు సాగులో నిమగ్నమయ్యారు. ఈ నెల 12 నుంచి బడిబాట పట్టేందుకు విద్యార్థులు సిద్ధమయ్యారు. ఇలాంటి కీలక సమయంలో అధికారుల బదిలీలు ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది వేచి చూడాలి.

తహసీల్దార్లను పాతస్థానాలకు బదిలీ చేయండి

రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌కు ట్రెసా విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సందర్భంగా బదిలీ చేసిన తహసీల్దార్లను, నాయబ్ తహసీల్దార్లను తిరిగి పూర్వపు స్థానాలకు బదిలీ చేయాలని రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌కు ట్రెసా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు వారు గురువారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం సొంత జిల్లాలో పనిచేస్తున్న, మూడేండ్లు మించి ఒకే జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లను, నాయబ్ తహసీల్దార్లను, ఇతర కార్యాలయాల్లో డిప్యుటేషన్లపై పనిచేస్తున్న తహసీల్దార్లను సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారని గుర్తుచేశారు. వారంతా కొన్ని నెలలుగా కుటుంబాలకు దూరంగా ఉంటూ విజయవంతంగా ఎన్నికల విధులు నిర్వహించారని తెలిపారు. గతంలో కూడా సాధారణ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఉద్యోగులను యథాస్థానాలకు బదిలీ చేసే అనవాయితీ ఉన్నదని గుర్తుచేశారు.

అమెరికాకు మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూన్ 6(నమస్తే తెలంగాణ): విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి మంత్రి శ్రీధర్‌బాబు అమెరికాకు వెళ్లారు. గురువారం నుంచి 11వ తేదీ వరకు అట్లాంటా, వాషింగ్టన్, న్యూయార్క్ తదితర నగరాల్లో పర్యటించి వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. కోకాకోలా, డెల్టా ఎయిర్‌లైన్స్, బోయింగ్, టెస్లా తదితర కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరుపుతారు. అనంతరం 11న అమెరికా నుంచి దుబాయ్ వెళ్లి అక్కడ కూడా పలు కంపెనీల ప్రతినిధులతో చర్చిస్తారు. 13న రాష్ట్రానికి వస్తారు.

అటు బదిలీలు.. ఇటు దరఖాస్తులు

- జీవో-317, 46 బాధితులపై తేల్చని సర్కారు
- విద్యాశాఖలో ఈ నెల 20లోపు బదిలీలు పూర్తి

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): 'జీవో-317ను సమీక్షించి బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తాం. బదిలీల క్యాలెండర్ ద్వారా ఏటా వేసవికాలంలో ఉద్యోగులు, టీచర్ల బదిలీలు చేపడతాం' అంటూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ బుట్టదాఖలయ్యింది. జీవో-317, జీవో-46 బాధితుల సమస్యలను పరిష్కరించకుండానే విద్యాశాఖలో బదిలీలకు సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 8 నుంచి 20 వరకు టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నారు. స్పౌజ్ బదిలీల కోసం అనేకమంది వేచిచూస్తున్నారు. పలు ప్రభుత్వ శాఖల్లో కింది స్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు ఉద్యోగుల బదిలీకి కసరత్తు జరుగుతున్నది. ఈ నేపథ్యంలో తమ సమస్యలు పరిష్కారం కావని జీవో-317 బాధిత ఉద్యోగులు, టీచర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉద్యోగులు, టీచర్ల సమస్యల పరిష్కారానికి త్రిసభ్య కమిటీని ప్రభుత్వం వేసింది. జీవో-317పై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. నెలలు గడుస్తున్నా, కమిటీలు వేస్తున్నా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టుగా ఉండటంతో బాధితులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ సూచనతో జీవో-317, జీవో 46 బాధితుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గురువారం కొత్త వెబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు GO317 and46issues. telangana. gov.in పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు సూచించారు. ఫిర్యాదులిచ్చే లోపు బదిలీలు పూర్తయితే చేసేదేముంటుందని ఉద్యోగ సంఘాలు పెదవి విరుస్తున్నాయి.

నేటి నుంచి ప్రపంచ వరి సదస్సు

హైదరాబాద్, జూన్ 6(నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ కమాడిటీస్ సంస్థ తెలంగాణ ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్‌లోని హోటల్ తాజ్‌కృష్ణాలో ఈ నెల 7, 8 తేదీల్లో ప్రపంచ వరి సదస్సును నిర్వహిస్తున్నది. అంతర్జాతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక కావడం సంతోషంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఈ అవకాశాన్ని అధికారులు, శాస్త్రవేత్తలు, ఎగుమతిదారులు, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. స్వాతంత్ర్యం అనంతరం మన దేశంలో వరి ఉత్పత్తి దాదాపు 8రెట్లు పెరిగి, 14 కోట్ల మెట్రిక్ టన్నులకు చేరుకుందని చెప్పారు. వరి ఎగుమతులలో భారతదేశ వాటా దాదాపు 45శాతంగా ఉందని, మన దేశం నుంచి వివిధ రకాల వరి ధాన్యం సుమారు 100 దేశాలకు ఎగుమతి అవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ లాంటి వరి మిగులు రాష్ట్రాలకు వరి ధాన్యాన్ని ఎగుమతి చేసే అవకాశాలు చాలా ఉన్నాయని ఆయన సూచించారు.

తెలంగాణ తల్లి పేరుతో రేవంత్ కొత్త డ్రామా

ఢిల్లీలో మీడియాతో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తన పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవటానికి డిసెంబర్ 9 నుంచి తెలంగాణ తల్లి ఉత్సవాల పేరిట కొత్త డ్రామాలకు తెరలేపారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ మండిపడ్డారు. 100 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు. ఢిల్లీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడారు. ఆరు నెలల్లోనే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అపనమ్మకం ఏర్పడిందని, కాంగ్రెస్ పాలనలో విత్తనాల కోసం రైతులు బారులు తీరారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటి నుంచి తప్పించుకోవడానికి, కాలయాపన చేసేందుకు తెలంగాణ తల్లి పేరిట కొత్త డ్రామాలకు తెరలేపారని మండిపడ్డారు. సోనియాగాంధీ తెలంగాణ దేవతా? బలిదేవతా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పరిస్థితి ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ వరుసగా 3 సార్లు ఓడిపోయిందని, ఇండియా కూటమి మొత్తం 233 సీట్లు దక్కించుకుంటే, ఒక్క బీజేపీకే 240 సీట్లు వచ్చాయని పేర్కొన్నారు.

తెలంగాణ తల్లి జన్మదినంగా జరిపితే తప్పేమిటి?

బీజేపీకి పీసీసీ వైస్ ప్రెసిడెంట్ నిరంజన్ ప్రశ్న

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): డిసెంబర్ 9వ తేదీని తెలంగాణ తల్లి జన్మ దినోత్సవంగా జరిపితే తప్పేమిటని బీజేపీని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ప్రశ్నించారు. తెలంగాణ తల్లి జన్మదినాన్ని తమ ప్రభుత్వం నిర్వహిస్తామంటే బీజేపీ నాయకులకు ఉలుకు ఎందుకు? అని అన్నారు. బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 60 ఏండ్లు పోరాడిన తర్వాత తమ అధినేత్రి సోనియాగాంధీ తన జన్మదిన కానుకగా డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రకటన చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. యుపీఏ చైర్‌పర్సన్‌గా సోనియాగాంధీ తీసుకున్న నిర్ణయం, ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఏర్పడిందని వెల్లడించారు. సోనియాగాంధీ పట్ల ఆ మాత్రం కృతజ్ఞత భావము ఉండకూడదా? అని నిలదీశారు. రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2నే నిర్ణయం తీసుకోవాల్సి ఉండేదని తెలిపారు. రాష్ట్రంలో సీట్లు పెరిగాయని బీజేపీ నేతలు చంకలు గుద్దుకోవటం మాని, దేశ ప్రజలు బీజేపీకి ఎందుకు చెక్ పెట్టారో ఆత్మవిమర్శ చేసుకుంటే మంచిదని హితవు పలికారు.

15న రాష్ట్ర సచివాలయం ముట్టడి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

సమావేశంలో అభివాదం చేస్తున్న కృష్ణయ్య, ప్రవీణ్ కుమార్, రాజారాం యాదవ్ తదితరులు

ఖైరతాబాద్, జూన్ 6: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న తలపెట్టిన సచివాలయ ముట్టడిని జయప్రదం చేయాలని బీసీ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం బీసీ జనసభ, బీసీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో 'కామారెడ్డి డిక్లరేషన్-సమగ